# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# డి.మధుసూదన రావు

( విజయచిత్ర, 1968, మార్చి సంచిక నుంచి)



చలన చిత్ర నిర్మాత అంటే చలన చిత్ర 'విజ్ఞాన సర్వస్వం' లాంటి వ్యక్తి. ఆ వ్యక్తికి అన్ని శాఖలతోనూ పరిచయం వుండాలి; అన్ని విషయాలలోనూ అనుభవం వుండాలి. ప్రేక్షకుల మనస్తత్వాల దగ్గర్నుంచి, కథా కమామీషులను నిర్ణయించడం వరకూ చిత్ర నిర్మాత క్షుణ్ణంగా తెలుసుకుని వుంటాడు. కేవలం పెట్టుబడి పెట్టడంతోనే నిర్మాత బాధ్యత తీరిపోదు; నిర్మాణ వ్యవహారాలను ప్లాన్ చెయ్యడం, కథ, మాటలు పాటలు దగ్గర్నుంచి తక్కిన శాఖలన్నీ చూసుకోవడం వరకూ అతనికి బాధ్యత వున్నది. అలా అన్ని శాఖలతోనూ పరిచయం, అన్ని రంగాల్లోనూ అనుభవం, మంచి అభిరుచులూ గల నిర్మాతలు కొద్దిమందే వుంటారు. అన్నపూర్ణా అధినేత మధుసూదనరావుగారు వాళ్ళల్లో ఒకరు.

ఏ కథను ఎన్నుకోవాలి? ఆ కథకు రచయిత ఎవరు? దర్శకుడెవరు? పాత్రలు ఎలా వుంటాయి? ఆ పాత్రలను ధరించడానికి సరైన నటీనటులు ఎవరు? షూటింగ్ కార్యక్రమాలు ఎలా? ఏ దృశ్యం తక్కువైంది? ఎందుకైంది? --- ఇలాంటి

సవాలక్ష విషయాలను ఆలోచించడంలో, చర్చించడంలో మధుసూదనరావుగారు గట్టివారు. ఆ గట్టిదనమే ఆయన చిత్రాల్లో కనిపిస్తుంది. ఆ గట్టిదనంతోనే ఆ చిత్రాలూ విజయవంతం కాగలుగుతున్నాయి. 'అన్ని రంగాలతోనూ వున్న పరిచయంతో పాటు అభిరుచి కూడా ముఖ్యమైనది.' అన్నది మధుసూదనరావుగారి అభిప్రాయం. ఆ అభిప్రాయం ఏర్పరుచుకోడానికి జరిగిన – ముందు కథలో వున్న అభిరుచులూ అలాంటివే.

స్వగ్రామమైన కృష్ణా జిల్లాలోని పెయ్యేరులో చిన్నతనం గడిచిన రోజుల్లోనే ఆయనకు మంచి అభిరుచులు కలిగాయి. నాటకాల మీద ఆసక్తి కలిగింది. వేదాంతం రాఘవయ్యగారు ఆ వూరు రామాలయంలో కూచిపూడి నాటకాలు ప్రదర్శించేవారు. నాటకాలను చూడడంలోనూ, చూసి విమర్శించడంలోనూ ఆయన ప్రజ్ఞను సంపాయించారు.

పెయ్యేరులో ఎలిమెంటరీ స్కూలు చదువు అయిన తర్వాత, గుడివాడలో స్కూల్ ఫైనల్ దాకా చదివి, బందరు నోబుల్ కాలేజీలో ఇంటర్, బి.ఏ. చదివారు. ఇంటర్ మీడియట్ లో ఫస్ట్ క్లాస్ వచ్చింది. మద్రాసు వైద్య కళాశాలలో సీటు కూడా వచ్చింది. కానీ తండ్రిగారి అస్వస్థత వల్ల మెడిసిన్ చదవడం వీలుపడలేదు. అలా 'వీలుపడకపోవడమే' ఆయనను నేడు చిత్రనిర్మాతగా చేసింది. తండిగారికి జబ్బు చెయ్యడంతో, ఇంటి దగ్గర వుండవలసి రావడం వల్ల రెండేళ్ళ విరామం ఏర్పడింది. ఆ రెండేళ్ళూ మధుసూదనరావుగారిని పాతికేళ్ళ అనుభవజ్ఞుడిని చేశాయి. గొప్ప గొప్ప రచనలను చదవడం, అర్థంచేసుకోవడం, చర్చలు చెయ్యడం లాంటివెన్నో జరిగాయి. ఆయన స్వగ్రామానికి బాగా దగ్గర్లోనే వున్న ముదినేపల్లిలో ఎక్సెల్షియర్ క్లబ్ అన్న పేరుతో ఒక చిన్న సమితిని ఏర్పాటు చేసి, ఆటలలో ఉత్సాహం చూపించడం సాగించారు. ఆ సమితి టోర్నమెంటులను జరిపేది; అనేకమంది క్రీడాకారులకు ప్రోత్సాహం చూపేది. ఆ సమితికి మధుసూదనరావుగారు కార్యదర్శి.

మధుసూదనరావుగారికి నాటకాల మీద వున్న ఉత్సాహం చేత, కోడూరి అచ్చయ్యగారి సహకారంతో ఎక్సెల్షియర్ క్లబ్ లో నాటక శాఖను కూడా ఆరంభించారు. అప్పుడు పురాణ నాటకాలూ, పద్య నాటకాలూ మంచి చెల్లుబడిలో వుండేవి. ఆ నాటకాలవల్ల సాంఘిక ప్రయోజనం వుండదనీ, సాంఘిక నాటకాలయితే సమాజానికి ఉపయోగకరంగా వుంటాయనీ, సాంఘిక నాటకాలను వెలుగులోకి తీసుకు రావాలనీ నిర్ణయించుకున్నారు. కోనేరు కుటుంబరావు రాసిన "ఆశాజ్యోతి" అనే నాటకాన్ని ఆయన చూశారు. ఆ నాటకంలో ఇరవై దృశ్యాలున్నాయి. పాటలు పద్యాలూ వున్నాయి. దాంతో నాటకం పూర్తయేసరికి తెల్లారింది! ఆ నాటక ఇతివృత్తం మధుసూదనరావుగారిని బాగా ఆకర్షించడంవల్ల ఆ నాటకాన్ని తీసుకుని కుదించారు! రసవత్తరమైన సన్నివేశాలను కల్పించారు. మంచి పాటలు పెట్టారు.

మధుసూదనరావుగారి అత్తవారి వూరు కాటూరు. కాటూరు, పెండ్యాల నాగేశ్వరరావు గారి వూరు. అప్పటికే పెండ్యాలగారు సినిమా పరిశ్రమలో హార్మోనిస్టుగానూ, సహాయ సంగీత దర్శకుడిగానూ పని చేసి, బాంబుల భయంవల్ల మద్రాసు విడిచిపెట్టి కాటూరు చేరుకున్నారు. ఆయనకూ, మధుసూదనరావుగారికీ, ఉన్న పరిచయం వల్ల – పెండ్యాలగారిని 'ఆశాజ్యోతి' నాటకానికి సంగీత దర్శకునిగా తీసుకున్నారు. అయితే హీరోయిన్ సమస్యయింది. ఆ రోజుల్లో స్త్రీ పాత్రలను ఎక్కువగా మగవాళ్ళే ధరించేవారు. బాగా అందంగా వుండి, పాడగలిగే మగాడు కావాలి. ఏం చెయ్యాలని వాళ్ళంతా ఆలోచనలో పడ్డారు. కాస్సేపు ఆలోచించి, పెండ్యాల గారు ఓ సలహా ఇచ్చారు.

"ఓ గుడివాడ కుర్రాడిని చూశానండీ. అబ్బాయి అద్భుతంగా పాడుతున్నాడు. విప్రనారాయణలో దేవదేవి వేశాడు. అచ్చం ఆడపిల్లలా వున్నాడు" అన్నారు పెండ్యాల. సరే అని, ఆ అబ్బాయి కోసం గాలించి, పట్టుకున్నారు–చూశారు–మాట్లాడారు–తమ నాటకంలో హీరోయిన్ వేషం వెయ్యమని అడిగారు,తీసుకొచ్చారు. ఆ 'హీరోయిన్' – అక్కినేని నాగేశ్వరరావు. నాగేశ్వరరావుతో మధుసూదనరావుగారి పరిచయం అలా జరిగింది. నాటక సమాజాలు క్రమశిక్షణాయుతంగా వుండాలని, ఓ పద్ధతిలో సాగాలనీ, మధుసూదనరావుగారు ఆలోచించేవారు. పకడ్బందీగా రిహార్సల్సు వేయించేవారు; కచ్చితంగా తయారయేట్టు చూసేవారు. నాగేశ్వరరావుగారి సంభాషణలన్నీ పురాణ పద్ధతిలో వుండేవి. సాంఘిక నాటకం కాబట్టి, ఆ భాషనూ, ఉచ్చారణనూ సరిగ్గా అలవడ జేసుకోవాలని దైతా గోపాలం గారిని పిలిపించి, నాగేశ్వరరావుకు నేర్పడానికి ఏర్పాటు చేశారు. పెండ్యాల గారి చేత ఆర్కెస్ట్రాతో సహా పాటలు కంపోజ్ చేయించారు. నాటకాల్లో పాటలకి బాక్ గ్రౌండ్ మ్యూజిక్కూ మంచి ఆర్కెస్ట్రాతో రావడం అదే మొదటిసారి! ఆ నాటకం విజయవంతమైంది. తర్వాత 'ఆశాజ్యోతి' నాటకాన్ని చాలా చోట్ల ఆడారు. అయితే, నాటకంలో సమ్మెలు లాంటి ఉద్యమాలు వుండడం వల్ల ప్రభుత్వం వారు ఆ నాటకాన్ని నిషేధించారు.

దాంతో ఎక్సెల్షియర్ క్లబ్ వారికి ఆడడానికి చేతిలో నాటకం లేకుండా పోయింది. త్రిపురనేని రామస్వామిగారికి ఓసారి సన్మానం జరుగుతూంటే, ఆ సందర్భంలో ప్రదర్శించాలని "సత్యాన్వేషణ" అనే నాటకాన్ని తీసుకున్నారు. అయితే, నాటకం ప్రదర్శించే ముందు ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి కాబట్టి , ఆ నాటకానికీ అనుమతి రాలేదు. ప్రభుత్వం దృష్టిలో ప్రజలను రెచ్చగొట్టేవిగా వున్నాయన్న సన్నివేశాలను తగ్గించి, అనుమతి తీసుకుని తర్వాత ఆడారు. అయితే కొన్నాళ్ళకు మళ్ళీ ఆ నాటకం నిషేధంలో పడింది !

ఎక్సెల్షియర్ క్లబ్ వారికి మంచి పేరు వుండేది. వారి నాటకాలకి డబ్బు బాగా వచ్చేది. కొప్పరపు సుబ్బారావుగారు 'నూర్జహాన్' పేరుతో రాసిన నిషేధింపబడిన నాటకాన్ని కొన్ని మార్పులుచేసి, "కోహినూర్' పేరుతో ఆడసంకల్పించారు. తోట వెంకటేశ్వరరావును (నేటి కళాదర్శకుడు) పిలిపించి, అతనికి ఒక పాత్ర ఇచ్చారు. బసవరాజు సుబ్బారావుగారు కూడా అప్పుడు సమితిలో చేరారు.

ఇలా – ఎక్సెల్షియర్ క్లబ్ మూడు పువ్వులూ ఆరు కాయలూగా వర్ధిల్లింది. క్లబ్బుకున్నంత పేరూ వారు ప్రదర్శించే నాటకాలకూ వుండేది. విప్లవాత్మకమైన నాటకాలను ప్రదర్శించడంలోనూ, కట్టుదిట్టమైన నాటకాలను ప్రదర్శించడంలోనూ, ఆ సమితి మార్గదర్శకమైంది. అలా కావడానికి ముఖ్య కారకులు మధుసూదనరావుగారు.

ఎక్సెల్షియర్ క్లబ్ వారి నాటకాలకు అశ్వరాజ్ ఫిలింస్ నిర్మాత గోపాలరావు, కీ.శే. మంగయ్య మేకప్ చేసేవారు. వారి ద్వారా, చలనచిత్ర నిర్మాతా దర్శకుడూ అయిన ఘంటసాల బలరామయ్యగారికి అక్కినేని నాగేశ్వరరావు పేరు తెలిసింది. బలరామయ్యగారు 'సీతారామజననం' చిత్రం తీస్తూ శ్రీ రామ పాత్రధారి కోసం అన్వేషణ సాగిస్తున్నారు. సమితివారంతా ఓసారి 'తెలుగుతల్లి' నాటకాన్ని ప్రదర్శించి తిరిగి వస్తూ వుండగా, బెజవాడ స్టేషన్లో బలరామయ్యగారు వాళ్ళను కలుసుకుని, నాగేశ్వరరావును చూశారు. తన కోరిక వ్యక్తం చేశారు. అవకాశం వెతుక్కుంటూ వచ్చింది గనక, కాదనరాదని, మధుసూదనరావుగారు నాగేశ్వరరావుకు సలహా ఇచ్చారు; తనకూ సినిమా ఉత్సాహం వున్నందువల్ల నాగేశ్వరరావు ఎగిరి గంతేశాడు !

నాగేశ్వరరావు సినిమాల్లోనూ, తోట డి.వి.సుబ్బారావుగారి ట్రూప్ లోనూ, పెండ్యాల గూడవల్లి రామబ్రహ్మంగారి సంస్థలో సహాయ సంగీతదర్శకుడిగానూ చేరడంతో, ఎక్సెల్షియర్ క్లబ్ వారి నాటకసమితి మూతపడవలసి వచ్చింది! ఆ తరవాత కోడూరు అచ్చయ్యగారు అప్పుడే స్థాపింపబడిన ప్రజా నాట్యమండలిలో చేరారు.

గూడవల్లి రామబ్రహ్మంగారూ, మధుసూదనరావుగారు మిత్రులు, మధుసూదనరావుగారికి గుడివాడలో ఖద్దరు వస్త్రాలయం వుండేది. దానికి బట్టలు కొనడానికని దక్షిణప్రాంతం వెళుతూ, మద్రాసులో వున్న రామబ్రహ్మంగారికి వంట్లో బాగులేదని తెలిసి, ఆయనను చూడ్డానికి వెళ్ళారు.

మాటల్లో రామబ్రహ్మంగారు తను 'మాయాలోకం' చిత్రం ప్రారంభిస్తున్నట్టూ దాంట్లో శరాబంది రాజు పాత్రకు చక్కని అబ్బాయి కోసం చూస్తున్నట్టూ చెప్పారు. మధుసూదనరావుగారు, నాగేశ్వరరావు పేరు సూచించారు. మొదట్లో ఆయన, ఆ పాత్రకు నాగేశ్వరరావును తీసుకోడానికి అంత ఇష్టపడకపోయినా, తర్వాత బాగా తృప్తి పడ్డారు; మధుసూదనరావుగారికి అభినందనలూ కృతజ్ఞతలూ తెలియజేశారు.

అయితే, మధుసూదనరావుగారికి నాటకాలు మీద వున్న ఉత్సాహం తగ్గలేదు. పైగా అధికం కాసాగింది. ఆంధ్రనాటక కళాపరిషత్తులో జేరి, ఉత్సాహంగా పని చెయ్యడంతో జాయింట్ సెక్రెటరీ అయ్యారు. ఆయన ఆ హోదాలో పని చెయ్యడం ప్రారంభించినప్పుడే పరిషత్తు నియమావళిలో కట్టుదిట్టమైన నిబంధనలు ఏర్పడ్డాయి. అప్పుడే మొదటిసారిగా నాటక పోటీలు జరిపారు. ఆ సందర్భంలోనే గూడవల్లి రామబ్రహ్మంగారినీ, భానుమతినీ సన్మానించారు.

ఆంధ్రనాటక కళాపరిషత్తులో ఆయన అమితోత్సాహంతో పని చెయ్యడంవల్ల ఆయనకు నాటక సాహిత్యం, ప్రదర్శనలమీద ఎక్కువ ఉత్సాహం కలిగింది. పరిషత్తు కమిటీలో వుండడంవల్ల అనేకమైన కొత్త నాటకాలు చదవడానికి ఆస్కారం ఏర్పడింది. కొత్త నాటకాలు రావాలన్న ఉద్దేశంతో 'కొత్త' నాటకాలే కావాలని, పరిషత్తు – రచనలను ప్రోత్సహించసాగింది. ఉత్తమంగా ఎన్నికైన పరిషత్తు నాటకాలను అనేక పట్టణాల్లో పరిషత్తు శాఖలను ఆరంభించి ప్రదర్శించేవారు. ప్రేక్షకులకు సాంఘిక నాటకాల మీద, కొత్తరకం నాటకాలమీద అభిరుచి కలిగింది. ఇవాళ చిత్రసీమలో రచయితలుగా పని చేస్తున్న నరసరాజు, ఆత్రేయ, పినిసెట్టి, అనిసెట్టి, గోపాలరాయశర్మ మున్నగు రచయితలందరూ పరిషత్తులో పాల్గొన్నవారే. మదుసూదనరావుగారికి ఆ విధంగా రచనలతోనూ పరిచయం ఏర్పడింది.

నోబులో కాలేజీలో చదువుకంటున్న రోజుల్లో ఇంగ్లీషు ప్రొఫెసర్ 'బాగ్ షా' గారికి మధుసూదనరావుగారు ప్రియశిష్యుడు. ఇంగ్లీషులో మదుసూదనరావుగారు తెచ్చుకునే మార్కులను చూసి అంతా ముచ్చట పడేవారు. బి.ఏ.లో వారికి ఇంగ్లీషులో యూనివర్శిటీ ఫస్టు కూడా వచ్చింది. ఆ సందర్భంలోనే బాగ్ షా దొర మదుసూదనరావుగారికి 'వరల్డ్ ఫేమస్ షార్ట్ ప్లేస్' అన్న ఉత్తమ గ్రంధాలనూ బహుకరించారు. నేటికీ మధుసూదనరావుగారు వాటిని ప్రాణప్రదంగా చూసుకుంటారు. బాగ్ షా దొర ప్రోత్సాహంతో మధుసూదనరావుగారు ప్రముఖ ఆంగ్ల రచనలన్నీ క్షుణ్ణంగా చదివి, చాలా విషయాలి గ్రహించారు.

ఇవాళ – 'తెరవెనక' ఆయన స్క్రిప్టు మీద చేసే చర్చల వెనక, అలాంటి అనుభవం వున్నది. "పల్లెటూర్లో పుట్టి, పట్టణాల్లో పెరిగి, అనేక రకాల వ్యక్తులను కలుసుకోవడం, అనేకుల మనస్తత్వాలను గ్రహించడం వంటివి ఎన్నో, చిత్ర పరిశ్రమలో నాకు సహాయకారులైనాయి." అంటారాయన.

సినిమాలతో మధుసూదనరావుగారి పరిచయం విమర్శలతో ఆరంభమైంది. ఆ రోజుల్లో విడుదలైన చిత్రాలను చూసి, ఆయన మంచిచెడ్డలను విమర్శిస్తూ నిర్మాతలకు లేఖలు రాసేవారు. ముఖ్యంగా, స్నేహితులైన గూడవల్లి రామబ్రహ్మంగారు, ఘంటసాల బలరామయ్యగారు, భరణి రామకృష్ణగారూ, మధుసూదనరావుగారి విమర్శలకోసం ఎదురు చూసేవారు. ఆయనలో ఈ 'మంచిచెడ్డల విమర్శ' అన్న గుణం వున్నదని, మొదటిసారిగా గూడవల్లి రామబ్రహ్మంగారు, తమ 'పల్నాటి యుద్ధం' చిత్రం స్క్రిప్టును వినిపించి, ఆయనతో చర్చించారు. అప్పుడే మధుసూదనరావుగారికి, సినిమా స్క్రిప్టును ఎలా చర్చిస్తారన్న విషయం అర్ధమైంది. రామబ్రహ్మంగారి ద్వారా పరిశ్రమలోని అనేక వ్యక్తులతో పరిచయం ఏర్పడింది.

అనుభవం, అభిరుచి రెండూ కలిసి 1951 లో మధుసూదనరావుగారిని చిత్ర నిర్మాతను చేశాయి. మంచి చిత్రాలు తయారు చెయ్యాలనే ఉద్దేశంతో, నవయుగ శ్రీనివాసరావు, నాగేశ్వరరావుగార్ల తోడ్పాటుతో ఆయన అన్నపూర్ణా సంస్థను ఆరంభించారు.

అన్నివిధాలా విజయవంతమయే చిత్రాలను తియ్యాలన్నది ఆ సంస్థ ఆశయం. మొదటి చిత్రానికి ఆయన కె.వి.రెడ్డిగారిని దర్శకునిగా తీసుకున్నారు. 'పెద్దమనుషులు' చిత్రంతో రెడ్డిగారు బిజీగా వుండడంవల్ల మూడేళ్ళపాటు నిరీక్షించవలసి వచ్చింది! అభిరుచి అనేది వున్నది కాబట్టే, అన్నేళ్ళు ఆయన నిరీక్షించగలిగారు. ఆ మూడేళ్ళలోనూ ఆయన అనేక కధలు విన్నారు; అనేక కధలు చదివారు; చర్చించారు. ఆ మూడేళ్ళలోనూ కలిగిన అనుభవాలు అనంతమైనవి. 'దొంగరాముడు' వారి మొదటి చిత్రం. 1954లో ప్రారంభించారు. కె.వి.రెడ్డిగారికి ప్రొడక్షన్ శాఖలో అనుభవం వుండడం చేత, ప్రొడక్షన్ వ్యవహారాలను కూడా ఆయనే చూసుకునేవారు. మధుసూదనరావుగారు ఆ అనుభవం అంతా రెడ్డిగారి దగ్గరే నేర్చుకున్నారు. 'దొంగరాముడు' చిత్రం అఖండమైన విజయం సంపాయించింది. దాంతో అన్నపూర్ణాసంస్థా, మధుసూదనరావుగారు ప్రేక్షకులలోనూ, పరిశ్రమలోనూ ఓ స్థానం సంపాయించుకున్నారు.

తర్వాత, 'తోడికోడళ్ళు' చిత్రాన్ని ఆరంభించారు. కె.వి.గారు బిజీగా వుండడంతో, సామర్ధ్యం వున్న దర్శకుని కోసం వెతికి, 'అమరసందేశం' చిత్రాన్ని చూసి, ఆదుర్తి సబ్బారావుగారిని తీసుకున్నారు. అప్పుడే సెల్వరాజ్ గారినీ (ఛాయాగ్రహణ శాఖకు) తీసుకున్నారు.

అక్కడినుంచీ అన్నపూర్ణాసంస్థ చక్కని సాంఘిక చిత్రాలను అందివ్వడం సాగించింది. మాంగల్యబలం, వెలుగునీడలు, ఇద్దరు మిత్రులు, చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మగౌరవం, పూలరంగడు మొదలైన చిత్రాలు ప్రేక్షక హృదయాలలో ఓ స్థానం సంపాయించుకున్న చిత్రాలు. ఈ చిత్రాల్లోని కొన్ని చిత్రాలను అన్నపూర్ణాసంస్థ తమిళంలో కూడా నిర్మించి, ఖ్యాతి సంపాయించింది; వీటిలో చాలా చిత్రాలు బహుమతులూ సంపాయించాయి!

కొత్త కొత్త రచనలనూ, కొత్త రచయితలనూ, ప్రోత్సాహించాలని, మధుసూదనరావుగారి ఉద్దేశం. డాక్టర్ శ్రీదేవి, కొర్రపాటి గంగాధరరావు, యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, భమిడిపాటి రాధాకృష్ణ, గొల్లపూడి మారుతీరావు, ముప్పాళ్ళ రంగనాయకమ్మ మున్నగువారిని సినిమా రచయితలుగా సినిమా రంగానికి పరిచయం చేశారాయన.

"నాకు ఉన్న నమ్మకం – ముందు కధ మీద; తర్వాత దాన్ని తెరమీద చెప్పడం మీద; తర్వాత తక్కిన వాటిమీద" అంటారు మదుసూదనరావుగారు. చిత్రానికి కథే ప్రాణం కాబట్టి దాన్ని నిర్ణయించుకోవడంలోనూ, దాన్ని తెరకు మలచుకోవడంలోనూ శ్రద్ధ కనిపించాలన్నది ఆయన సిద్ధాంతం.

"నాకు మెలోడ్రామామీద నమ్మకంలేదు. చిత్రం చూస్తుంటే, 'అయ్యో పాపం!' అనాలేగాని, ఏడవకూడదు. నా ఉద్దేశం కథలో కొత్తదనం వుండి, విసుగు లేకుండా దాన్ని ట్రీట్ చెయ్యగలిగి, హాస్యం, చక్కని సంగీతం పెట్టగలిగితే చిత్రం తప్పక విజయవంతం అవుతుంది అని. చిత్రాల్లో హాస్యం, కథతో కలిసి వుండాలి గాని, వేరుగా వుండకూడదు. మంచి కథ గనక వుండేట్టయితే, దానికి తారాబలం అవసరం వుంటుంది; తారాబలం ఆ చిత్ర విజయానికి దోహదమూ చేస్తుంది. కథలో బలం లేకపోతే, తక్కిన ఏ బలాలూ ఏమీ సహాయం చెయ్యలేవు.

అయితే, ఇదివరలో మేము అందివ్వగలిగినంత క్వాలిటీని ఇవాళ ఇవ్వలేకపోతున్నామన్నది నాకు బాగా తెలుసు. దానికి కారణం.. అందరూ బిజీగా వుండడం; ఆలోచించి చెయ్యడానికి వ్యవధి లేకపోవటం. అంచేత విధిలేక కొన్ని కొన్ని నిర్ణయాలను తొందరగా తీసుకోవలసి వస్తూవుంటుంది మరి !" అన్నారాయన.

మదుసూదనరావుగారికి కె.వి.రెడ్డి గారంటే గురి. ఆయన గీసిన గీతల్లోనే ఇవాళ కూడా ఆయన నడుస్తున్నారు. "కథ, ట్రీట్మెంట్, నిర్మాణ పధకాలు మొదలైన వెన్నో ఆయన నేర్పారు" అంటారు మదుసూదనరావుగారు.

"మన సాంఘిక జీవన విధానాల్లో కొన్ని నిబంధనలున్నాయి. వాటిని అధిగమిస్తూ చిత్రాల్లో చూపడం భావ్యం కాదు. పాత్రపోషణలోనూ, కథనంలోనూ కొత్తదనం అవసరమే గాని, ఆ కొత్తదనం వెర్రితలలు వెయ్యకూడదు. ఏ సన్నివేశమూ, ఏ పాత్రా కూడా అసహజంగా వుండరాదు. చిత్రాల్లో వస్తున్న 'అసభ్యకరమైన సెక్స్' ను నేను ప్రోత్సహించను. దాని మీద నాకు ఏ మాత్రం నమ్మకం లేదు" అన్నారాయన.

మన సంప్రదాయాలూ, కట్టుబాట్లు, నీతినియమాలూ వీటిని దృష్టిలో పెట్టుకుని, అన్ని తరగతుల వారినీ ఆకర్షించేలా చిత్రాలు నిర్మించే దుక్కిపాటి మదుసూదనరావుగారు ప్రస్తుతం – శ్రీ సారధి స్టూడియోస్ వారు నిర్మించబోతున్న చిత్రాన్ని 'ప్రొడ్యూస్' చేస్తారు. ఆ తరువాత అన్నపూర్ణా వారి కొత్త చిత్రాన్ని ఆరంభిస్తారు. ఆ సన్నాహాల్లోనే ఆయన ఇప్పుడు 'బిజీ' గా వున్నారు.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS